విశాలాక్షి

రాయసము వెంకటశివుఁడుగారు

౧

నాగయ్యశాస్త్రి నవరసనగర ప్రఖ్యాత పౌరులలో నొకఁడుకాఁడు. పిత్రార్జితమగు స్వల్ప భూవసతి నాధారముచేసికొని, సంతృప్తి సకలైశ్వర్యములుగ నెంచి, కాలము గడుపుచుండువాఁడు. ఆకుచాటు పిందెవలె నింటనణఁగియుండెడి వాని కింత ప్రశస్తి యిపుడెట్లు వచ్చెను? పురమునం దేవంకఁ జూచినను నాగయ్యశాస్త్రిని గుఱించి చెప్పుకొనువారే కానఁబడుచున్నారు. బజారులలోను, బహిరంగ ప్రదేశములందును, ప్రజల ప్రసంగములకు ప్రధానవిషయము శాస్త్రియె! నీరాటరేవులందలి నెలఁతలు మొదలుకొని, పాఠశాలలలోని బాలుర వఱకును పట్టణవాస్తవ్యులు శాస్త్రి ముచ్చటలే ప్రస్తావించుచుందురు. చిన్నలు, పెద్దలు, స్త్రీలు పురుషులు,—ఎల్లరును నాగయ్యశాస్త్రి చరితమునే రామస్మరణముగఁ జేసికొన్నారు. దీనికిఁ గారణమేమి?

ఏదేని గొప్పవిశేషమున్నఁ గాని యెవరిఁగుఱించియైన జను లింతగఁ జెప్పుకొనుచుండరు. ఏలాటరీలో బహుమానమో, ఏ పెద్దపరీక్షలోని గెలుపో, ఏగొప్పవారితోడి వియ్యమో, అసామాన్యలాభ మెవరికైనఁ జేకురినప్పుడె యిట్టి మూన్నాళ్ల ముచ్చటలు ప్రబలుచుండును. అశుభము సంభవించెననుకొన్నను, దగ్గరవారి కెవరికో యాకస్మిక మరణము, ధనాపహరణము, ఉద్యోగనష్టము,- మొదలగు కష్టము లేవియో సంప్రాప్తింపవలెను గదా! నాగయ్యశాస్త్రికిగాని, అతనిబంధువులకుఁ గాని యిట్టి యాకస్మిక శుభాశుభము లెవ్వియు నిటీవల సంభవింపలేదే! అటులైన ప్రజల కాతనిగుఱించి యింత యాశ్చర్యము, ఆందోళనము నేలఁ గలుగవలయును?

౨

పాఠకుల కుతూహలము తీర్చుటకుఁ జెప్పవలసినదేమనఁగా—నాగయ్యశాస్త్రిమీఁద నగర వారాంగనలలో మిన్న యొకతె భరణమున కభియోగము గొని వచ్చెను! ఆసత్యకాలపు బ్రాహ్మణుని మీఁద నెఱజాణ వనజాక్షి వ్యాజ్యెము వేయుట, ఎవరి కాశ్చర్యము గొలుపదు? మొదలు, నాగయ్యశాస్త్రి యునికియె జను లెఱుఁగనప్పుడు, ఆవంశ గౌరవము, ఆతని నిష్ఠానియమములు నెవరు వెదకెదరు? ఆపురుషుని చిరపరిచితులు సయితము మనుజుల గుణశీలముల రహస్యము వారి మొగమున విశదము గాకపోవచ్చునని యనుమానింపఁజొచ్చిరి! బాగుగ నెఱిఁగినవారు మాత్రము, అనుజనునికి విలాసినీజనులతోటి సంసర్గము కేవల మసంభవమనియె విశ్వసించిరి. ఇట్లు వారివారి మనోభావానుగుణముగ నాగయ్యశాస్త్రిని గుఱించి పురవాసులు భిన్నాభిప్రాయులై యుండిరి.

ఒరుల జోలికిఁ బోకుండెడి నైష్ఠికుని మీఁది కిట్టి యపవాదములు దొరలఁగారణమేమి? లోకమనఁగా, వివిధ చిత్తవృత్తులతో నొప్పెడి జనావళిగదా! సత్రములు, చావడులు నెలకొల్పు సజ్జనులును, దారులలో ముండ్లు కొట్టు తుంటరులును, జగతిని గలసి మెలసియే మనుచుందురు! నాగయ్యశాస్త్రి నిరాడంబర జీవితము సాధువులచక్షువులకుఁ జాటుపడియుండినను, కుజనుల కన్నులకు గంతలుగట్ట నేరకుండెను. ఒక ప్రాతఃకాలమున నదిలోస్నానముచేసి, మంత్రోచ్చారణచేయుచు నింటికి వచ్చుచుండు శాస్త్రి కెదురుగ, సీమసారాయి సేవించి యొడలెఱుఁగక బాటప్రక్కఁపడిపోయిన యొక యువకుఁడు గనఁబడెను. పరిచితునివలెనుండిన వాని మోము శాస్త్రి పరికింపఁగా, న్యాయవాది నారాయణశర్మ కనులు తెఱచి, బిడియమున మనసునందలి మైకము మాయమైపోఁగా, దిగ్గున లేచి కూర్చుండి యాయనకు నమస్కరించెను. ఈచిన్న సంగతి శాస్త్రి మనస్సీనుండి తోడనె తొలఁగి పోయెనుకాని, తన తప్పు పరుల కంటఁబడెనని శర్మ మిగులఁ గనలెను. సంశయాత్ముల కన్నియు నాపదలవలెనే తోఁచును.- ఒకనాఁడు నరసింహ

నారాయణు లోకరి నొకరు చెట్టబట్టికొని, గుమ్మము ముందుండి సాగిపోవునపుడు, వీథియరుగుమీఁదఁ గూర్చుండు నాగయ్యశాస్త్రి వారిని తేఱిపాఱిచూచెను. చిన్ననాఁడు కళాశాలలో సహాధ్యాయులుగ నుండెడి వీరిప్పటికి నన్యోన్యానురాగమున నొప్పుచున్నారు. సామాన్యముగ సమశీలురకే స్నేహసఖ్యములు సమకూరుచుండును. న్యాయవాది నారాయణశర్మవలెనే, వైద్యుఁడగు నరసింహారావు నాయుఁడును, స్వవృత్తిని మంచిలాభ మందఁజాలక, యసంతృప్తిని గాలము గడుపుచున్నారు. తాము జీవనమునకెంతయొ గాసిపడుచుండునపుడు, ఇతరులనాయాససౌఖ్య మేల యనుభవింపవలెనని వీరు పేరలుకఁ బూని యుందురు. పదిమంది రోగులు తన యొద్ద కెపుడు పరుగెత్తికొనివత్తురా యని నాయుఁడును, చిక్కులలోఁ జిక్కిన నలుగురు కక్షిదారులు తనకెట్లు కండ్లఁబడెదరాయని శర్మయును, సతతము నాత్రపడుచుందురు! తమ కుపకరింపనివారు నిరర్థకులనియు, మిూఁదు మిక్కిలి విరోధివర్గపువారనియు వీరు తలపోయుచుందురు!—తమ కేకీడును దలంపని నాగయ్యశాస్త్రిని గుఱించి యాస్నేహితు లంత నిట్లు ముచ్చటించుకొనసాగిరి.

నారాయణ: "ఒకే ముంగివలె నుండు ఈ శాస్త్రి కెంత గర్వమనుకొన్నావు! ఆమధ్య నొక నాఁడు ప్రొద్దున విస్కీడోజు ఎక్కువై పెద్దవీథిని నేను క్రింద పడిపోయినపుడు, తన సొమ్మంతయు పడిపోయినట్లు వీఁడు నాదగ్గఱకువచ్చి ముఖము గుర్తుపట్టెనురా! మాటా మంచీ లేకుండ, కనులు పెద్దవిచేసి, తలయూపి, యంతట వెడలిపోయినాఁడు! వీఁడు వట్టి తంత్రగొట్టుసుమీ! నాఁటి నాసంగతి యందఱికిని వీఁడు ప్రచురించుచున్నట్లు నే ననుమానపడుచున్నాను!"

దీనికి నాయుఁ డిట్లు ప్రత్యుత్తరమిచ్చెను:— "దానికి సందేహమేమి? వీనికి మన సంఘముమీఁద ప్రబల విరోధము — మన జాడలు వెలికిఁదీసి ప్రకటింపవలెనని వీనియుద్దేశము! రంగయ్యపంతులు, నేనును ఆమధ్య రిఫ్రెషుమెంట్సు రూములో బీఫ్ పుచ్చుకొనుచుండఁగా, తనపుట్టె మునిగిపోయినట్లు వీఁడు తలుపుత్రోసిచూచి, మందుగడ్డదొరుకునా యని యడిగి, లేదని బట్లరు చెప్పుచున్నను లోనికి చొరుచుకొనివచ్చి, ముఖములు పరిశీలించి మరలిపోయెను! ఎవడికైనా రోగమువచ్చునుగాని, వీడికి పడిసెమైనా పట్టదుగదా! తమ యింట్లో వాండ్రకిటీవలవచ్చిన జ్వరమునకు నాచే వైద్యముచేయింపుమని పున్నారావుచేనే కబురుపంపగా "మాస్తోమాస్తో శూద్రవాడి చేతినీళ్లు మందుపేరుచెప్పి మేమెట్లు త్రాగఁగలము!" అని శాస్త్రులు చెప్పివేసి, బ్రాహ్మణ వైద్యుని బెట్టినాడు. బీఫు సంగతి నాటికి నేఁడు జ్ఞాపకము వచ్చినది కాఁబోలు, శాస్త్రులు నన్నిపుడు తేఱిపాఱి చూచి, మనము దాటిరాగానే, ఛను కనే కాండ్రించి ఊసినాడు! మననుజూచి బొత్తిగా లెగిచాడే కాదు!"

నారాయణ: "ఇంక తెలిసినది వీడిసంగతి వీడి భరతము పట్టితేనే గాని, మనకు మిండడవు తాడు! ఈసాయంత్రము వనజాక్షిని చూడఁబోవుచున్నాను. అది జాణ. వీణ్ణి వంచించే యుపాయము చెప్పఁగలదు! శాస్త్రిమీఁద ఏ జట్టివచ్చినా, మనకన్నివిధాలా లాభమేకదా! ఈమధ్య కేసు లేమిూరాక, చేతులు కట్టివేసిన ట్లున్నవిరా! చూదాము మన అదృష్టము!"

3

తనకంటె వయస్సున చిన్నయైనను వలపున నారాయణు పెద్దయని భావించి వనజాక్షి మొదటినుండియు నావన్నెకానియందు తీఱని మోహమునఁ దవిలియుండెను. చెన్నపురి నుండునపు డారసికుని వ్యయములకు వారవనిత చేతిడబ్బు పెట్టుచుండెనని చెప్పుకొనిరి. నారాయణ చెప్పిన నాగయ్యశాస్త్రి వృత్తాంతము ఆవెలయాలు శ్రద్ధతో వినెను. అనుదినమును శాస్త్రిస్నానముచేసి తమయింటిముందుగనె పోవుచుండువాఁడైనను, ఆతనికి వనజాక్షికిని పరిచయ మేమియు లేదు. నిష్ఠాగర్వమున నుప్పొంగు శాస్త్రి నొక "ఊఁపు ఊఁపి" పాదాక్రాంతుఁడైన పిదప వానిని వదలిపెట్టెదమని ప్రియుఁడు మందహాసమునఁ బలికినపుడు, తన కాఛాందసునిమీఁద వైరబుద్ధిలేకున్నను, వాని నాడించి కామునికి వినోదము

గలిపింపవచ్చునని వారకాంత వల్లెయనెను. ఆ ప్రేయసీ ప్రియులపు డేర్పఱచుకొనిన విధాన మేమనగా ఆబాల్యము తాను నాగయ్యశాస్త్రి యుంపుడుకత్తెననియు, ఇటీవల నేకారణముననో యాయనకు తనమీఁద మొగ్గలము తగ్గి తనను బోషింప విరమించెననియు, తనకును, తమ కిరువురకును గలిగిన కొమార్తెకును, మనుగడకు వలసిన భరణ మిప్పింపుడనియు. వనజాక్షి న్యాయస్థానమున నిపు డభియోగము కొనివచ్చుటకుఁ బూనుకొనెను! నాగయ్యశాస్త్రి దెస నేకోశమునను వైరబుద్ధి వహింపని వనజాక్షి తనవలపుకాఁడును కేవలము వినోదార్థమే యీనాటకమునఁ బాల్గొనుచున్నాడని భ్రమపడెను. కాని, శాస్త్రి మీఁద పగఁబూనిన నారాయణ, "ఊరక యాకొమ్మ నూఁపుటకే" కాక, అదలి పండ్లతో తానొడిసింపుకొను దురుద్దేశమున, వలసినచో నద్దాని విఱిచివేయుటకును సంకల్పించుకొనెను!

౪

న్యాయసభలో నిపుడు వనజాక్షి నాగయ్యశాస్త్రియు వాది ప్రతివాదులుగ నిలువఁబడిరి! పనిగల వారికి లేనివారికిని, ఈ నాటకము చూచి వినోదించు పెద్దపని గలిగెను. వ్యాజ్యేము విమర్శింపఁబడు దినములందు సభాభవనము న్యాయవాదులతోను ప్రేక్షకులతోను నిండిపోవుచుండెను. అందఱి మాడ్కికును, ఈ కపటనాటక సూత్రధారుఁడగు నారాయణ శర్మ ముఖ్య లక్ష్యమయ్యెను. ఇట్టి చమత్కారకథను నెలయించి, ఇందఱికి వినోదము గల్పించిన నారాయణుని మీఁద తోడి న్యాయవాదు లభినందనములు కురిపించిరి. అదివఱకు నోరెత్తి పలుకనేరని యాతఁ డొకసారిగ చమత్కార సంభాషణ చతురుఁడయ్యెను. సభాస్థలము, వనజాక్షి వదనసౌందర్యసరస వాగ్విలాసములు నలుగడల వ్యాప్తమగుట కేర్పడిన రంగస్థలమయ్యెను. నారాయణుని మాయావ్యూహమర్మ మెఱుంగని పెక్కండ్రు ప్రేక్షకులు, ఇంతకాలము తనను ప్రేమించిన నిరపరాధినియగు నాయను వ్రతను, నిర్హేతుకముగ విడనాడిన పాతకము బ్రాహ్మణుని ముఖసీమను పంక్తులు తీర్చి వ్రాసి యున్నట్టుగ భావించిరి! నాగయ్యశాస్త్రి రూపసి కాఁడు. పాడుపడినయింట బూఁజుపట్టినట్లు, అయుంగ వైకల్యమునకు తోడు ఛాందసమును, సురుచిర వస్త్రాద్యలంకారముల పట్ల విముఖతయును, వెఱ్ఱివికారమును దెచ్చిపెట్టెను! ఇంక వాక్కున మార్దవము మచ్చునకైన గానరాదు! సమయాసమయము లెఱుఁగని కోపోద్రేకములకు వశవర్తుఁడగు నతని వాక్పారుష్య ప్రభావమున, ఆతని పక్షమందలి సత్యము అసత్యముగఁ బరిణమించుచుండెను! అభియోగకారణముల యథార్థత అధికారి విమర్శనమునకె విడిచివైచి, శాంతమార్గమున నతఁడు తన పనులు చక్కపఱచుకొనుచుండిన యెడల పరిస్థితులు బాగుగనుండెడివి. అట్లు చేయక, అశుద్ధఛాందసుఁడు, వాది, న్యాయమూర్తి, న్యాయవాది సమూహము, ఒకరేల-లోకమంతయు, తన సత్యపక్షమును ప్రతి ఘటించుటకవతరించిన పెద్దకలిమాయ యని తలపోసి, నిరతము దుమదుమలాడు మొగముతో జగతిమీఁదికి దాడివెడలెడి వెఱ్ఱి పాంచాలికునివలె వర్తించెను! తన మితభాషిత్వమునకుఁ గొఱంత తెచ్చెడి కటువులగు పదములు ప్రయోగించి యొక్కొకమాఱును, మౌనాభాసమగు నిశ్శబ్దత నూని యొక్కొకమాఱును, తనపక్షమునకు వాంపరాని నష్టము గలిగించుకొనెను. పెంకెపెడసరి కట్టెలతో మనసిచ్చి మాటాడు వారెవరు? ఐనను, తనవైపున వాదింపసమర్థుఁడగు న్యాయవాది నేర్పాటు చేసికొమ్మని యొకరిద్దఱు మిత్రులు బోధింపఁబోఁగా, శాస్త్రి వారిమీఁద మండిపడి, సకలమగు నన్యాయముల కాకరమగు న్యాయవాదుల సాయము ముమ్మాటికి తన కక్కఱలేదని చెప్పివేసి, వాది పక్షమున బలమగు సాక్ష్యము రుజు వగుచుండఁగ, ఉపేక్షతోఁ దానూరక చూచుచుండెను!

౫

ఇప్పటికి వాదిపక్షమున సాక్ష్యము పూర్తి యయ్యెను. చిన్ననాఁటినుండియు వనజాక్షిని నాగయ్యశాస్త్రి చేరఁదీసి పోషించి, తన ప్రేమమున కాస్పద మగు నాకామినియందొక కొమరితను బడసెననియును, ఇపుడు కారణముగ నా చపలుఁ డాయబలను విడనాడె

ననియును, మాతాపుత్రికల పరిపోషణమునకు ప్రతివాది యాదాయమునుండి సగమిచ్చినఁగాని చాలదనియును, రుజువయ్యెను. ఋజువులకేమి భాగ్యము? ఈకాలమున న్యాయసభలలో పలుకుబడికలవా రెట్టిసాక్ష్యమునైన సమకూర్చి, ఎట్టి యన్యాయమునైన సమర్థించుకొనుచున్నారుగదా! ఇంక, తన సాక్షులను బిలిపించి, తన వాదము జరిపించుటకు సిద్ధపడవలయునని న్యాయాధిపతి ప్రతివాదిని హెచ్చరించెను. దీనికై యాతనికిఁ గొన్ని దినములు గడువీయఁబడెను.

ఒకానొకరు అదృష్టదేవతను తనమూఁపపట్టెపట నని యడుగఁగా, జనుల సాధువాక్కులనని యా పరసురాలు ప్రత్యుత్తరమిచ్చెను! నాగయ్యశాస్త్రి యాగ్రహస్వభావుఁడని కనిపెట్టి, శత్రువులు వానినాదినములలో ననేకవిధములఁ గాకుచేసిరి. ఈవాదిప్రతివాదులకు వరూధినీ ప్రవరాఖ్యులని ప్రతినామములిడి, వారిని ప్రజలు పరిహసించుచుందురు! నగుమోమునసుండు వరూధిని కే మాటయునివఁ గినుక లేదుకాని, ప్రవరాఖ్యుని యందుమాత్ర మాతని పేరిటివానికిఁ గల శాంతరసము మృగ్యము! పట్టుకొనువానికి పరుగిడువాఁడు లోఁకువ. న్యాయసభ కూడుటకు ముందును వెనుకను, అపటి యేపంచనైనఁ గూర్చుండు నాగయ్యశాస్త్రి యొద్దకు వనజాక్షి మెల్లగఁజేరి, "ఏమి బ్రాహ్మఁడా! నీనీమాలు, జపాలుఁ ఎందుకు? ఏళ్లకొలదీ నమ్మిన నన్ను గొంతుక కోసి, కడుపునబుట్టిన కూతురు నీదికాదని చెప్పివేసి, నీవేమి ముందుకువస్తావు? ఇంత అన్యాయము నీకేల? ....”అని నిందించుచుండును! శాస్త్రిదానిమీఁదఁ గోపించి, అనరానిమాటలని, యాచోటు విడిచి యట్టె పోవును. ఇదిచూచి పెచ్చుపెరిఁగి వేశ్య మఱింత గోల చేయుచుండును. వినోదమున జనులు కోలాహలము చేయుచుందురు. తన న్యాయవాది నారాయణయ్యాఁత గైకొని, అంతకంత కావారకాంత, ప్రతివాదిని వాని యింటికడనె ముట్టడింపసాగెను! మాటిమాటికిని స్త్రీ ఘోషించుచుండుట, పురుషుఁడు కోపించుచుండుటయుఁ గనిపెట్టి లోకులు, ఆఁడుదాని మాటలు నిజమనినమ్మి, శాస్త్రి సద్వర్తనమును గూర్చి సందేహింపఁ జొచ్చిరి.

ఇంతేల, ఇట్టి పరిస్థితులవలన, శాస్త్రిదారాపుత్రాదులకే, అగ్నిహోత్రునివంటి వాఁడని పేరుపడిన గృహయజమానునం దపోహములు పొడమసాగెను! లోకయాత్ర యింత దుర్భరమైనపుడు, తాను గృహస్థాశ్రమమిఁక విసర్జింపవలదాయని శాస్త్రి యంత లోలోనఁదలపోయుచు, దిన మొక యేఁడుగఁ గడుపుచుండెను.

౬

ప్రతివాది సాక్ష్యము పరీక్షించు దినము వచ్చెను. పండ్రెండు గంటలకు న్యాయాధికారి యున్నతాసనాసీనుఁడయ్యెను. న్యాయవాదులతోను, ప్రేక్షకులతోను సభాభవనము క్రిక్కిఱిసి యుండెను

“మీసాక్షు లేరయ్యా? మీవాదనయేమి?” అని యధికారి ప్రతివాదిని సంప్రశ్నించెను. అంతట కోప సంతోషములు తనముఖాధిపత్యమునకై కొట్లాడుచుండెనా యనునట్లుగ, మొగము చిట్లించి వెఱ్ఱినవ్వు నవ్వి, శాస్త్రి లేచి యిట్లనెను. “నేను మనఃచేసికొనునదేమియు......” అధైర్యావేశమున జనించిన యకాండవైరాగ్యమహిమమున శాస్త్రి, తన కేమియు వాదన లేదని చెప్పివేసి, తనసర్వస్వమును వారవనితకుఁ గట్టిపెట్టవచ్చునని న్యాయాధిపతికి విన్నవింప నుద్యుక్తుఁడయ్యెను. కాని యాతని వాక్యము పూర్తికాకమునుపె బఱ్ఱుబఱ్ఱుమను శబ్దముతో నొక మోటారుబండి సభ గుమ్మము నొద్దకు వచ్చి నిలిచెను. అందుండి యొక పెద్దమనుష్యుఁడు దిగి, లోనికివచ్చి, తాను ప్రతివాది పక్షపు బారిష్టరునని పలికెను. ఇట్లు వచ్చినవారు చెన్ననగర న్యాయవాదులలో నగ్రగణ్యులగు సర్వేశ్వర శాస్త్రిగారు. ఈ వ్యాజ్యెము మూలమున వీరి జూచు భాగ్యము తమకు లభించెనని సభాసదులు మురిసిపోయిరి. ఈతని సాయమున పాపము ప్రతివాది యీచిక్కునుండి బయలుపడునని పలువురు సంతసించిరి. నిశ్శబ్దముగ నుండుఁడని యధికారి ప్రేక్షకులను హెచ్చరించెను. ఏమి జరుగునో యను కుతూహలమున ప్రేక్షకులు తేఱిపాఱి చూచుచుండిరి.

చెన్నపట్టణపు బారిష్టరు, ఈలోపుగ ప్రతివాదిని న్యాయవాది ప్రముఖులను సంప్రదించి, తనచిన్న పుస్తకమునఁ గొన్ని సంగతులు వ్రాసికొనెను. సర్వేశ్వర శాస్త్రి యంతటలేచి, "గౌరవనీయులగు న్యాయమూర్తులకు ప్రతివాది చేసికొను మనవి యేమనఁగా వాది పక్షమున ఋజువైన సాక్ష్యము ప్రతివాదికిని చాలును. అతనికి వేరే సాక్ష్య మక్కఱలేదు. నాకక్షిదారుఁడు చేసికొను సంక్షిప్తమగు మనవిలో రెండే యంశము లున్నవి. మొదటిది: వారకాంతయగు వాదికి భరణమున కర్హత లేనేలేదు. ఉన్నదనుకొనిన యెడల, వాది యింక ముందు పవిత్రజీవితము గడపుదునని వాగ్దానము చేసెనేని, న్యాయమని తోఁచిన మొత్తమును భరణముగ విధింప వచ్చును. వాది అట్లుండ సమ్మతింప దేని, భరణమునకే యర్హురాలు కాదు. రెండవయంశము: లేఁబ్రాయముననున్న కూఁతును వాది కూటవృత్తిని దింపకుండ ఆమె సంరక్షణమునుండి బాలను తక్షణము తొలఁగించి తగిన శరణాలయమునఁ జేర్పింపుఁడని ప్రతివాది ప్రార్థించుచున్నాఁడు. అట్టి పరిహారము, ఇక్కడ లభింపనిచో, వేఱు న్యాయసభలో పొందుటకు ప్రతివాది ప్రయత్నింప నున్నాఁడు.

"వాది సాక్ష్యమును, ప్రతివాది మనవిని న్యాయమూర్తు లాలోచించి, తీర్పుచెప్పవచ్చును" అని పలికెను.

అంతట సభాభవన మంతటను, ముఖ్యముగ న్యాయవాదుల పీఠములయొద్దను, కలకలము చెలరేగెను. "బంక వాదమునకు మొండివాదము జవాబు!", "వాది నోట పచ్చివెలగకాయ పడినదే!" అని మందహాసములు చేయుచు, వకీళ్లు మాటాడుకొనసాగిరి. వాది వకీలు, ఇపుడీయెదురుమాడని యుదంతమున కమితముగ నిరుత్సాహమందెను. ఇటీవల న్యాయవాదులమధ్య మధ్యందిన మార్తాండుఁడై వెలిగిన నారాయణశర్మ, ఇపుడు పగటి చందురునివలె వన్నెవాసియుండెను. ఆతఁడిపుడు తక్కిన న్యాయవాదులతో గుసగుసలు సాగింపఁజొచ్చెను. అపుడె ఫలాహారమునకు లేచిన న్యాయమూర్తి, తాను తిరిగి వచ్చులోపల సంగతి యేదో తేల్చుఁడని వాదిప్రతివాదుల వకీళ్లను హెచ్చరించి వెడలిపోయెను. అంతట వాదిప్రతివాదులును, వారి వకీళ్లును, తక్కిన న్యాయవాదులతో నాలోచనలు సల్పి, యొక కాకితమును తయారుచేసిరి. తిరిగి సభలోనికిరావేగమె, తనకు దాఖలుచేయఁబడిన యా కాకితమును జూచుకొని, న్యాయాధిపతి "ఈ కేసును మధ్యవర్తిగనుండి పరిష్కరించుటకు, న్యాయవాది వాసుదేవరావుగారు ఉభయవాదుల వలనను, వారి వకీళ్ల వలనను కోరఁబడినారు. కాఁబట్టి వాసుదేవరావు గారిని ఆకార్యమునకు నియమింపడ మైనది." అని చెప్పి, వేఱుపనిని చూచుకొనఁదొడంగిరి.

౭

ఈ వ్యాజ్యమున నందఱు నమితముగ కుతూహలురై యుండుటవలనను, త్వరితముగ తమ్మీపీడ వీడవలెనని ఉభయవాదులు నభిలషించుట చేతను, ఆరాత్రియె ప్రతివాదివకీలు చెన్నపురికిఁ బోవలసివచ్చుటచేతను, ఆ సాయంకాలమె దీని విమర్శనమునకు వాసుదేవ రావు గారు పూనుకొనిరి. అందఱికిని సదుపాయముగ నుండుటకై వకీళ్లగదియె సభాస్థలమయ్యెను. ఉభయవాదుల వకీళ్లెగాక, వారి యనుమతిమీఁద నితర న్యాయవాదులొకఁ డిద్దఱు సహాయము చేసిరి. వినోదమునకని కాంచిన యీయద్భుత కల్పనము తనకె యెదురు తిరిగి తనకక్షిదారురాలగు వనజాక్షి గొంతుక కురియగుటకు నారాయణశర్మ మిగుల వగచి, ఎటులైనఁ దా మీచిక్కునుండి తప్పించుకొనుటకు తహతహపడుచుండెను. నిరపరాధిమీఁద నిర్హేతుకముగ నభియోగము తెచ్చి, నాగయ్యశాస్త్రికిఁ దానుంపుడుకత్తెనని పట్టికల్ల ఋజువుపఱచి, తుదకు తన స్వతంత్రతను కూఁతు సంరక్షకత్వము నొక్కసారిగఁ గోలుపోవ సిద్ధమైన తనదుస్థితికి వనజాక్షి యెంతయు వగచుచుండెను. ఏపాపమెఱుఁగని తనమీఁద నీతప్పు వ్యాజ్యము తెప్పించి, తనను గాసిపెట్టి యవమానపఱచిన కలికాలపురుషులగు నారాయణ నరసింహులతోడను, వారు చెప్పిన చొప్పున నాటలాడి, తనకీర్తి ధనాదు లపహరింపఁబూనిన మాయలాఁడి వనజాక్షితోడను, తాను సమాధానపడనొల్లనని నాగయ్యశాస్త్రి మూతిముడిఁచి కూర్చుండెను!

ఈతగవు పరిష్కరింపుఁడని న్యాయాధిపతి యుభయపక్షములవారి కోరికమీఁదను నియమించుటచేత, తానీకార్యమునకుఁ బూనుకొనుచున్నానని వాసుదేవరావు పలికి, కాలహరణమునకుఁ గారణములగు దీర్ఘసాక్ష్యవాదములతోను, నిరర్థకములగు కర్మకలాపముతోను తమకు నిమిత్తము లేదనియును, సత్యాన్వేషణమునకును, సంధియొడఁగూడుటకును సహకారములగు సూక్ష్మసూత్రములె తామిపు డవలంబింపవలెననియుఁ జెప్పెను. త్వరితముగనె తాను తీర్పుచెప్పవలెనుగాన, ఇదివఱ కేమి జరిగెనన్ను, ఇపుడు మాత్రము తనయెదుట సాక్షులు పూర్తిగనిజముచెప్పి, ఎటులైన వాది ప్రతివాదులకు సఖ్యసమాధానములు గుదిర్చి, తనను గృతకృత్యునిచేయుమని యాయన వేడెను. ఇదివఱ కెన్నిరోజులు పట్టెనో యిపుడన్ని గంటలలోనే యీవిచారణ జరిగినను, వెనుకటివలెఁగాక సాక్షులందఱు కపటము విడిచి నిజము పలికిరి. అందుచేత, వినువారికెల్లరకును మిక్కిలి యాశ్చర్యము గొలుపునట్టి పరిస్థితులు బయలుపడెను! వ్యాజ్యము యొక్క నిజమైన కారణము లిపుడు బహిరంగమయ్యెను!

అంతట మధ్యవర్తి వాసుదేవరావు, తమయెదుట నిపుడు ఋజువైనసాక్ష్యమును, ఉభయపక్షములవాదమును, విమర్శించి, ఈ వ్యాజ్యమున వాదివకీలగు నారాయణశర్మయొక్క యసభ్య ప్రవర్తనము వలన న్యాయవాదిలోకమునకు ప్రతిష్ఠాభంగము కలిగెననియు, అతఁడిప్పుడీ వేశ్య నడుసులో దిగ విడిచి తాను తప్పించుకొనఁ జూచినను, నాగయ్యశాస్త్రి మరియాదకు నష్టము గలిగించినందుకైనఁ దానుత్తర వాదియై భావికాలమున చిక్కులలోనికి వచ్చుట స్పష్టమనియు, కావున తానీసమయమునసె యొక్కసారిగ తనచిక్కులు విడఁగొట్టుకొనుట యుక్తమనియుఁ జెప్పి, ఈ మాయావ్యూహము గల్పించినందు కాతఁడు వాది ప్రతివాదులకేమేమి పరిహారములు చేయునో ముందుగఁ దెలియఁగోరెను! శాస్త్రికేలోపములున్నను, గడుసుఁదనమున లోపము లేదు—వలలోపడిన నక్క గింజుకొనిన కొలఁది యురిలో మఱింతబిగియునట్టుగ, తప్పించుకొనఁ దానెన్ని యుపాయములుచేసినను, అన్నియువ్యర్థమై తనస్థితి మఱింత విషమించుట నామాయావి యిపుడు గ్రహించి, తాను పశ్చాత్తప్తుఁడనైతిననియు, ప్రతివాదియొక్కయు,సభానాయకునియొక్కయు దయాదాక్షిణ్యములె తనకు శరణమనియుఁ జెప్పివేసెను! వనజాక్షి యన్ననో, తన స్వాతంత్ర్యమును, స్వపుత్రికాపోషణాధికారమును గోలుపోని యేపద్ధతికేని యొప్పుకొందు ననెను—నాగయ్యశాస్త్రి తన యాత్మగౌరవమునకు భంగమును, ధర్మవిరుద్ధమును గాని పథకమునకు సమ్మతింతుననెను. రాత్రి పదిగంటలగునప్పటికి, న్యాయ్యమును, సర్వజనాంగీకారమును నగుమార్గము వాసుదేవరావు సూచించెను. దాని కందఱును సమ్మతించిరి. తనమీఁద నీయభియోగము తెచ్చి, తననుగాసినొందించినందుకు, వాదియు, వాది సలహాదారులును పరితపించి చేసినక్షమార్పణము ప్రతివాది యంగీకరించెను. వాది తనకూఁతునకు వ్యభిచారవృత్తి నుప్పకుండ దానిని యోగ్యుఁడగు వరునికిచ్చి పెండ్లిచేయ సమ్మతించెను. తానికముందు ఋజుమార్గవర్తనుఁడ నయ్యెదనని నారాయణశర్మ వాగ్దానముచేసెను. కాకితమెక్కనేని యీ కడపటి యొడఁబాటు యునకుఁడగు నా న్యాయవాది పరువు ప్రతిష్ఠలకు భంగకరమగుననియు, మఱియు నది వ్యాజ్యమునకు సంబంధింపని యన్యవిషయ మగుటచేతను అది తీర్పునఁ జేర్పఁబడలేదు. అంతటితో వాది ప్రతివాదుల వివాదములు తీఱిపోయెను. రాత్రి యందఱు నిండ్లకు వచ్చునపుడు పురుషోత్తమరావు తోటివకీళ్లలోఁ బలువురానందించినను, ఈయభియోగముపట్ల తనకు మొదటినుండియు నసమ్మతమెయనియును, ఒంటరియైనందువలనఁ దానేమియు చేయలేకుండియు న్యాయసభలో వ్యాజ్యపువైఖరి గనిపెట్టుచు తుదకు చిక్కు దీర్చుకొనుట ప్రతివాది కల విగానప్పుడు, తనకుఁ బరిచితుఁడును, నాగయ్యశాస్త్రికి దూరపుబంధువునగు సర్వేశ్వర శాస్త్రిగారికీసంగతి తాను తెలియఁబరిచితిననియు, తనకోరిక ప్రకారమాసత్పురుషుఁడు సమయమునకు వచ్చి శాస్త్రిని విపత్తునుండి తప్పించెననియు మాటల ధోరణిని జెప్పెను.

౮

గొప్పగాలివాన గృహవృక్షాదులను గూల్చివైచినను పుడమియందలి విషరోగాంకురములను రూపుమాపును. ఈ యభియోగము మూలమున సజ్జనుఁడగు నాగయ్యశాస్త్రి మితిలేని యవలజడిపాలైనను, నవరసనగరమందలి సాంఘిక జీవనము చాలవఱకు సుష్ఠుపడెను. నీతి నియమాదు లుల్లంఘించి స్వేచ్ఛగఁ దిరిగెడి యువకు లంతటి నుండియు సాధువర్తనముపట్ల సుముఖులై ప్రవర్తించిరి.

ఆపురమందలి యువజన పారిశుద్ధ్యసమాజమున కిపుడు నారాయణశర్మయె కార్యదర్శి. నరసింహారావునాయుడు సంఘ సంస్కరణము నందలి యభిమానమువలన, విద్యావతియు, సన్మార్గావలంబినియైన వనజాక్షి పుత్రికయు నైన విశాలాక్షిని బరిణయమయ్యెను. వెనుకటివలె ముక్కు మూసికొని కూర్చుండక, నాగయ్యశాస్త్రి, స్నేహపాత్రుఁడై సంఘోజ్జీవనమునకు సాయపడు సత్కార్యము లం దుత్సాహము గలిగియున్నాఁడు.

అతిథులకుఁ బెట్టునది భాగ్య మవనిలోన

కవిభూషణ, కవిరాజ శ్రీరాజా వత్సవాయ వేంకటనీలాద్రిరాజుగారు

పరిణతఫలపుష్పభార భాసురమైన వర్ణనీయోద్యాన వనములోన
బహువిధోపస్కార బంధు బంధురమైన మహనీయరమ్యహర్మ్యంబులోన
వితత వాతాయనాప్లుతమారుతంబైన శశికాంతమయచతుశ్శాలలోన
నతి మనోజ్ఞవ్యంజనాభిరామంబైన లాలిత కదళీదళంబులోన
రజితపాత్రంబులో మహారాజభోగ-సురుచిరాన్నంబు చక్రకేళరటిపండ్లు
మిసిమిగల యావుపెరుగుతో మేళవించి-యతిథులకు బెట్టునది భాగ్య మవనిలోన.